# మరమనిషి

అద్దంలో ముఖం చూసుకుంది సుజాత. పదిహేను సంవత్సరాల క్రితం తన ముఖమెలా ఉండేదో గుర్తు తెచ్చుకొంది. ఆనాటి నునుపైన బుగ్గలు ఈనాడు చప్పిబుగ్గ లయ్యాయ్. ఆనాటి కనులలోని మిలమిల, ముఖంలోని మిసమిస ఈనాడు లేవు.

కొంచెం ముఖమువంచి అద్దములో ప్రతిబింబం చూసింది అక్కడక్కడ నెరసిన వెంట్రుకలు. తన వయస్సుమళ్ళిపోతుంది నలభై సంవత్సరాలు దాటాయ్, ప్చ్...కన్యగానేగడిచిపోయింది. జీవితం. తానెన్ని అందమైన కలలు కన్నది జీవితం గురించి. ఎలాజీవితం మలచుకోవాలనుకుంది? తనజీవితభాగస్వామి ఎలా ఉండాలని కోరుకుంది?

తాను కాలేజిలో జాయినైన మొదటి సంవత్సరం విజయ్‌తో పరిచయం తరువాత స్నేహం, స్నేహమంటే సరిపోతుందా! ఎంత తియ్యనిబంధమది? నవ్వుతూ,నవ్విస్తూ, కవిస్తూ

తననెంతగా మురిపించాడు విజయ్! అతనితో తనజీవితమ్ ముడిపెట్టుకొని ఊహాలోకాల్లో విహరించింది. అతన్ని వివాహము చేసుకుంటానని తన అభిప్రాయం చెప్పినప్పుడు, ఈ తలిదండ్రులు తన చెల్లెలికిమరొక కులంవాడితో వివాహం జరిపిన తన తలితండ్రులు ఏమన్నారు?

"అమ్మాయ్ సుజాతా! చూడిలా— ఈ సైజు బాగుందంటావా?" తల్లి పిలుపు. ఆమె ఆలోచనలు చెదిరి పోయాయ్.

"నాకేం తెల్సమ్మా! నేనేం సారెలూ చీరలూ అందుకున్నానా! ఇచ్చానా!" నవ్వబోయింది కాని, ఎందుకో ఆమె కనుల్లోనీరుతిరిగింది.

"నిన్ను అడగటమే పొరపాటు." నిష్ఠూరం ధ్వనించింది తల్లి అనసూయ కంఠస్వరంలో. తాను చెల్లెలుపై ఈర్ష్య పడుతూందా! ఎందుకలా దురుసుగా జవాబిచ్చింది, 'బాగుంది, అంటే పోలా! ఎలా అయినా తన చెల్లెలు తెలివైంది. మీరు పెళ్ళిచేస్తారా? మమ్మల్ని ఏ రిజిష్టర్డు మేరేజో చేసుకోమన్నారా అడిగేసింది ఖచ్చితంగా. తాను అలా అడగ గలిగిందా! అనాడు రాత్రి పగలు పేకాటలో మునిగి ఇంటి సంగతి పట్టించుకోని తండ్రి, తన తర్వాత ముగ్గురు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు. ఆర్థిక ఇబ్బందులు, వచ్చే పోయే బంధువులు నువ్వు ఉద్యోగం చేసి ఈ కుటుంబాన్ని ఓ కొలిక్కి తేవాలి, సుజాతా మిత్రుల హెచ్చరిక. కాలేజీలో ఉబలాటంగా చేర్పించాడే కాని ఫీజులూ, పుస్తకాలు సంగతి పట్టించుకోలేదు తండ్రి

విశాఖపట్నంలో తాను టీచరు ట్రయినింగు అవుతూన్నప్పుడు విజయ్ దగ్గరనుంచి ఎన్నిఉత్తరాలు వచ్చేవి? ఆ ఉత్తరాలు చదువుకుంటూ తాను తన జీవితం గురించి ఎంత కమ్మని కలలు కనేది.

ఫలితం - సెకండరీ గ్రేడు ట్రయినింగు సీటుకి అప్లయి చేసింది, కాలేజీ చదువు విరమించుకొని, విజయ్ తనవైపు జాలిగా, సానుభూతిగా చూశాడు.

దీర్ఘంగా నిటూర్చిందిసుజాత. ఆమె పెదవులపై పేలవమైన నవ్వు కదిలి మాయమైంది.

బద్ధకంగా మంచం మీద వాలి కనులు మూసుకుంది. చెయ్యిజారిన అవకాశం ఆమెను వెక్కిరిస్తూంటే, గతం నుడులు తిరిగింది.

* * *

అమ్మా! విజయ్... విజయ్ ఉత్తరం వ్రాశాడమ్మా!" ఎంతసేపునుంచో ఎలా చెప్పాలా తల్లితో తన అభిప్రాయం అని ఆలోచించిన సుజాత- ఆమాట మాత్రమే చెప్పగలిగింది.

"ఏమిటివ్రాశాడూ! అంతాకులాసానా? నాన్నగారికా! నీకా! ఎవ్వరికి వ్రాశాడు ఉత్తరం!" సుజాతకు, విజయ్‌కి ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నా యన్న సంగతి తెలియని ఆమె తల్లి అనసూయ ప్రశ్నించింది.

"నాకు... నాకేనమ్మా!"

"ఏమని వ్రాశాడు!"

మౌనంగా తలవంచి ఉండిపోయింది సుజాత.

"చెప్పవే! ఏమని వ్రాశాడు? అయినా నీకు ఉత్తరం వ్రాయటం ఏం బాగుంటుంది! ఏదో ఇరుగుపొరుగులవారంగనుక స్నేహంగా తిరిగావు ఆ అబ్బాయితో. అంతేగాని ఉత్తరాలేమిటి?"

"మేం ఒకమాట అనుకున్నామమ్మా!"

"ఏమిటది"

"విజయ్...విజయ్ నన్ను పెళ్ళిచేసుకుందామనుకుంటున్నాడటమ్మా."

"బాగుంది బాగుంది తల్లీ! మేం తలెత్తి తిరగఖర్లేదింక నలుగుర్లో. అయినా మన కుటుంబ పరిస్థితులెరగని పసిపిల్లవేం గావు. నిన్ను చదివించిందీ, ట్రయినింగుకి పంపినదీ ఎందుకే! తర్వాతవాళ్ళకు కాస్త ఆసరా అవుతావనేకదూ!"

"అంతేనా, అమ్మా!"

"నిన్ను జీవితాంతం బ్రహ్మచారిణిగా బ్రతకమని అనను కాని, కొన్ని రోజులు ఆగి తర్వాత మన శాఖవాడిని చూచి చేస్తాం. అంతే కాని, ఆ అబ్బాయిని పెళ్ళి చేసుకోవటమంటే కుదరదు సుమా

అక్కడనుంచి వెళ్ళిపోయింది సుజాత. తల్లి అన్న ప్రతి మాటా విజయ్‌కి వ్రాసింది. తిరుగుటపాలో విజయ్ దగ్గరనుంచి

ఉత్తరం వచ్చింది. 'మావాళ్ళతో నా అభిప్రాయం చెప్పాను. వాళ్ళదృష్టిలో బోలెడుకట్నం తెచ్చే అమ్మాయిలు ఉన్నారట. నీకేం పొయ్యే కాలంరా అని చీవాట్లేశారు. అయినా, సుజా! నేను ఒక నిర్ణయానికి వచ్చాను - ఎవ్వరూ మనకి పందిరివేసి సాంప్రదాయ ప్రకారం పెళ్ళి జరిపించ నక్కరలేదు. ఊఁ అను చాదస్తంగా ఆలోచించక ఒక్క అడుగు ముందుకు వెయ్యి. రిజిష్టరుమేరేజ్ చేసుకుందాం. నీ జాబు చూసుకొని సెలవుపెట్టి వస్తాను అనివ్రాశాడు. అప్పటికే మంచివుద్యోగంలో స్థిరపడిన విజయ్.

గబగబా గుండె దడదడా కొట్టుకుంటూంటే, పెదవులు వణుకుతుంటే, ఉత్తరం చదివి, మడిచిపెట్లో పెడుతూంది సుజాత.

"ఏడవకమ్మా. అక్కయ్య వచ్చిందిగా - రామ్మూర్తి మేస్టరుగారింటికి వెళ్ళి బియ్యం తెమ్మంటాను. చిటికెలో వండిపెడతాను. తల్లి గొంతు వినిపించిది.

తనకు జ్ఞానం వచ్చిన దగ్గరనుంచీ ఆ ఇంటి ఆర్థికపరిస్థితు లిలానే ఉన్నాయి. తండ్రి - భార్యా పిల్లలు అన్నం తిన్నారా లేదా? అన్న సంగతి పట్టించుకోడు. అతనింటికి వచ్చినప్పుడు అన్నంపెడితే తింటాడు లేకపోతే పడుకుంటాడు. సుజాత మనస్సు వికలమయిపోయింది.

"అమ్మాయ్, సుజా!" అనసూయ పిలుపు-

ఇవతలికి వచ్చింది సుజాత.

"అన్నట్లు మరచిపోయానేవ్. రామ్మూర్తి మాష్టరు గారు నిన్నోసారి వాళ్ళ ఇంటికి రమ్మన్నారు."

"బియ్యం యివ్వటానికేనా!" ఆమె మాట మధ్యలో గొంతులో కొంచెం చిరాకు చోటుచేసుకోగా అడిగింది సుజాత.

"కాదే! చెల్లి ఏడుస్తుంటే బియ్యం అడగమందాం అనుకొన్నానే కాని, మొన్న జిల్లాపరిషత్‌లో నీ ఉద్యోగం గురించి చెప్పాడట. పాపం మీ నాన్నకన్నా ఆయనే నయం. అప్లికేషను పెడితే చూస్తామన్నారట. వెళ్ళి ఓసారి కనుక్కో--" అంది అనసూయ.

"అలాగేలే అమ్మా!" అంటూ రామ్మూర్తి మాస్టరు ఇంటికి వెళ్ళింది సుజాత.

అన్యమనస్కంగానే ఆయన చెప్పినట్లు ఆ టీచరు ఉద్యోగానికి అప్లికేషను పెట్టి వచ్చింది. 'కొంచెం టైము య్యి విజయ్‌నిన్ను పెళ్ళిచేసుకోటానికి. ఏ పద్ధతిలోనన్నా నాకు సమ్మతమే. అయితే ఇంటి పరిస్థితులే మంత బాగులేవు. దయ వుంచి నా కోసం కొన్ని రోజులు వెయిట్ చెయ్యి.' అని ఎంతో ఆలోచించిన మీదట ఉత్తరం రాసి పడేసింది విజయ్‌కి సుజాత.

మరుసటి నెలలో జిల్లా పరిషత్ గరల్స్ స్కూల్లో టీచరుగా జాయినయింది సుజాత. పరిచయస్థులూ, మిత్రులూ బంధువులూ ఎంతో అభినందించారు. ఇహ ఆ కుటుంబాన్ని

నువ్వే ఉద్ధరించాలి అన్నారు. తల్లీ ఆనందాశ్రువులు రాలుస్తు కౌగలించుకుంది. "అమ్మా! నువ్వు నాకు కూతురువి కాదు, కొడుకువి" అంది.

రెండు నెలలు జీతం అందుకొని సంసారం కోసం ఖర్చు పెట్టి అందర్నీ సంతోషపెట్టింది సుజాత.

మళ్ళీ ఉత్తరం రాశాడు విజయ్– 'మన పెళ్ళి గురించి ఏమిటి ఆలోచించావ్? మా వాళ్ళు అమ్మాయిల్ని చూడ మని తొందర చేస్తున్నారు. నువ్వు సరే అంటే నా అభిప్రాయం మా వాళ్ళకి చెబుతాను. వాళ్ళు అంగీకరిస్తే ఇబ్బంది లేదు. కాదంటే ప్రాశానుగా రిజిష్టర్ మారేజ్ చేసుకుందాం. వెంటనే జవాబివ్వు' అని.

ఓ సాయంత్రం తల్లి వంటచేస్తుంటే పక్కన పీట వాల్చుకు కూర్చుంది సుజాత. తండ్రి పక్క గదిలో కూర్చుని సిగరెట్ కాలుస్తూ పొరుగింటినుంచి తెచ్చుకున్న పేపరు చూస్తున్నాడు. ఇదే అదను. తన అభిప్రాయం ఇద్దరూ వింటారు. అనుకున్న సుజాత గొంతు సవరించుకొని, "అమ్మా!" పిల్చింది నెమ్మదిగా.

కూతురువైపు తిరిగి, సుజా! ఈ నెల జీతం అందగానే మంచి చీర ఒకటి కొనుక్కో. మన ఇబ్బందులు ఎప్పుడూ వుండేవే!" అంది అనసూయ.

"అదికాదమ్మా!" నసుగుతూ మళ్ళీ ఆగిపోయింది సుజాత.

"ఏమిటి? దేవుడి దయవల్ల ఆ రామ్మూర్తి మేస్టరు గారి ధర్మమా అని నీ వుద్యోగమయింది. మన కష్టాలు గట్టెక్కినట్లే."

"అహఁ అది కాదమ్మా! నాన్నగారి జీతంలో కొంత ఎలానూ ఇస్తుంటారుగా!"

"ఏముటే. ఏమిటి మాట్లాడాలని కూచున్నావు! నెల జీతంలో చీర కొనుక్కుంటానంటావు. అంతేనా!"

"చీరమాట కేంలే. నేనొక మాట అడుగుతాను. కాద నవుకదా, అమ్మా!"

"అడుగు. నేను కాదనే మాట నువ్వు మాత్రం ఎందుకు అడుగుతావు?"

"విజయ్‌కి కట్నకానుకలు అవసరంలేదు."

కూతురు అభిప్రాయం గ్రహించిన అనసూయ చేతిలో వున్న విసనకఱ్ఱ టప్పున క్రిందపడేసి బుగ్గకు చెయ్యాన్చి, నోరు తెరచి, ఎదురుగా కూర్చుంది తన కూతురేనా? అన్నట్లు చూడసాగింది.

"పెళ్ళి ఖర్చులు కూడా అవసరం లేదు."

"ఆఁ... బాగుంది."

"రిజిష్టరు మేరేజి చేసుకుంటాం. అంగీకరించండమ్మా నువ్వూ, నాన్నగారూను." అడిగింది ఇరవై ఏళ్ళు నిండిన సుజాత ఆశగా, ఆతృతగా ఆమెవైపు చూస్తూ.

"ఏమో, మీ నాన్నగారిని అడుగు." ముఖం తిప్పుకుం దావిడ.

అటూ ఇటూ పేపరు చూస్తున్న భద్రంగారి చెవిన ఈ సంభాషణ పడనే పడింది. పేపరు మడిచి చేత్తో పట్టుకొని ఇవతలికి వచ్చి చురుగ్గా కూతురువైపు చూస్తూ, "ఆ వెధవకి బుద్ధి లేకపోతే నీకుండఖ్ఖర్లా. పెళ్ళి చేసుకుంటుందట పెళ్ళి. మన శాఖవాడా ఏమన్నానా, ద్రావిళ్ళవువాడు. పౌరోద్యోపు వుధవ. వాడు తెగిస్తే నువ్వు తెగిస్తావా? అంతకన్నా ఏ నూతిలోనో పడి చచ్చినా ఓ కేక వేసి ఊరుకుంటాం గాని, నువ్వు వాణ్ణి పెళ్ళాడి ఊరేగితే మేం తలెత్తుకు తిరగలేక చస్తాం. బాగుంది. మహా బాగుంది. ఇంతవరకూ వచ్చిందీ భాగోతం! ఎక్కడున్నాడా విజయ్‌గాడు!... చెప్పు" రాళ్ళ వర్షంలా ఉన్న తండ్రి వాగ్ధాటికి ఆగలేని సుజాత గదిలోకి వెళ్ళిపోయింది. ఆత నా రాత్రి నిద్రపోయే వరకూ ఏమేమో అంటూనే ఉన్నాడు. నిదురలుముకోలేదు సుజాత. ఒక్కొక్క మాటా సూటిగా ఆమె హృదయాన్ని గాయపరచేవే.

మర్నాడు రెండు ముక్కలు విజయ్‌కి ఉత్తరం వ్రాసి పడేసింది. 'నిస్సహాయురాలిని విజయ్, క్షమించు. నాకు జన్మ ఇచ్చిన తలిదండ్రులూ, నా వెనుక పుట్టి నాపై ఆధారపడిన తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ తర్వాత ఎంత నాగరికత మనకున్నా సాంప్రదాయపు సంకెళ్లు ఛేదించుకో లేక పోతున్నాను. బాధ్యతలు విస్మరించి నువ్వు కోరిన ఒక్క అడుగు ముందుకు వెయ్యలేక పోతూన్నందుకు క్షమించు. నీ

తల్లి తండ్రులు తెచ్చిన సంబంధం చేసుకొని వారిని సంతోష పెట్టు. ఈ నిర్భాగ్యురాలు సుజాతను మర్చిపో, శేలవ్."

అంతే- విజయ్‌తో అనుబంధం తెగిపోయింది సుజాతకి

కుటుంబ బాధ్యత భుజాన ఎత్తుకుంది. ఆమె వివాహ ప్రసక్తి ఆ ఇంట్లో ఎప్పుడూ వచ్చేది కాదు. ఆమె తర్వాతి చెల్లెల్ని ఒక బంధువుల అబ్బాయి పెళ్ళిచేసుకుంటానని ముందుకి వచ్చాడు, రిజిష్టరు మారేజ్ చేసుకుంటానన్నాడు. 'ఏలానే, సుజాతా! చెల్లెలు పెళ్ళికి లోన్ పెట్టవూ! గతిలేని వాళ్ళలా రిజిష్టరుమారేజ్ ఏంబాగుంటుంది!' అని అనసూయ అనటంతో వెయ్యి రూపాయిలు లోన్ తెచ్చి సంతోషంగా చెల్లెలు పెళ్ళి జరిపించింది సుజాత.

ఆ చెల్లెలు రెండుసార్లు పురిటికి వచ్చింది. నాలుగు పండగలకి భర్తతో వచ్చింది. సారెలకూ, చీరలకూ అయ్యే ఖర్చు మోగగా భరించింది సుజాత.

ముప్పై సంవత్సరాలు నిండాయి సుజాతకి. మీ సుజాత కింక పెళ్ళి చెయ్యరా! అని ఎవరన్నా అడిగితే కస్సున కోడె త్రాచులా వారిపై కి లేచేది అనసూయ. ఏం మీ కేంభారంగా ఉందా నా కూతురు! నా కూతురి పెళ్ళిగోడవ మీ కెందుకు!" అని ఆమె నోటికిజడిసి ఎవరూ ఆ ప్రశ్న వెయ్యటమే మాను కున్నారు.

తర్వాత రెండో చెల్లెలు కులంకానివాడితో స్నేహం చేసినప్పుడు, అతను తన యింటికి రాకపోకలు సాగిస్తున్న ప్పుడు తప్పుగా భావించలేదు సుజాత తలితండ్రులు.

ఒకరోజు సుజాత రెండవచెల్లెలు సావిత్రి తల్లి తండ్రులు సమక్షంలో ధైర్యంగా అడిగింది. "మీరు నాకూ, బాబీకి వివాహం జరిపిస్తారా? లేక సింపుల్‌గా పెళ్ళిచేసుకుని వస్తాం. ఆశీర్వదిస్తారా? అదీ కాదంటే మేం వేరుగా వుంటాం. ఎలా అయినా మేమిద్దరం పెళ్ళిచేసుకుంటాం." అంటే సుజాత తలిదండ్రులు దిమ్మెరపోలేదు. ఆశ్చర్యం ప్రకటించలేదు. "చాలాచోట్ల వర్ణాంతర వివాహాలు జరుగుతున్నాయి. కాని య్యండి." అనేశాడు భద్రం. "ఏదో మనసు కలిగినంతలో ఇంటిదగ్గరే జరిపిద్దాం పెళ్ళి" అంది అనసూయ.

దిమ్మెరపోయింది, ఆశ్చర్యపోయింది సుజాతే! తనకు ఎదురు తిరిగిన తలిదండ్రులు తన చెల్లెలు అభిప్రాయాన్ని ఆమోదిస్తున్నారు. తన పెళ్ళి ప్రసక్తే ఎప్పుడూ ఎత్తుకోని తల్లి చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు సంతోషంగా జరిపిస్తూంది. తాను వారు కన్న బిడ్డ కాదా! తనకి మాత్రం కోరికలుండవా? తను స్త్రీ కాదా! ఆమె కనుల్లో నీరు నిండింది.

ఆ రాత్రి భద్రంతో అంటూంది అనసూయ- "పెద్ద దాని కిహ పెళ్ళి అయే యోగ్యత ఎలానూ లేదు. దానికి ముప్పై దాటాయి. వీళ్ళకయినా దేవుడిదయవలన పెళ్ళిళ్ళయి పోతే- ఏ కులం వాడయితే ఏమిటి? మన మేమన్నా కట్న కానుకలిచ్చి జరిపించగలమా ఏమన్నానా?" ఆ మాట సుజాత చెవిన పడింది. నిజమే అనిపించింది.

అప్పుతెచ్చి చెల్లెలి పెళ్ళి జరిపించింది.

ఆనాడు శాఖాంతర వివాహమని తనకు అభ్యంతరం చెప్పిన తలిదండ్రులు, దండ్రులు ఈనాడు వర్ణాతర వివాహం

జరిపించటం సుజాతకు సంతోషాన్ని కలిగించింది. అయితే ఆనాడు కాదని తన జీవితం బలిగొన్నారే అనే బాధ కూడా లేకపోలేదు.

ఈవేళ చెల్లెలుకి పూడిదలిచ్చి ప్రసవానికి తీసుకు వస్తూంది తన తల్లి అనసూయ. పేలవమైన నవ్వు కదిలింది సుజాత పెదవులపైన.

"మేడమ్! ఎవరో మీకోసం వచ్చారు." క్లాస్‌రూంలో పాఠం చెబుతూన్న సుజాత, ప్యూన్ వైపు తిరిగి "వెయిటింగ్ రూమ్‌లో కూర్చోమను వస్తున్నా" నని చెప్పింది.

వెయిటింగ్ రూమ్‌లో కుర్చీలో తలవంచి కూర్చున్న విజయ్‌ని చూస్తూనే తడబడిపోయింది సుజాత. రెండు క్షణా లేమీ మాట్లాడలేకపోయింది.

అడుగుల సవ్వడికి చివాలున తలెత్తిన విజయ్ తపనగా సుజాత వైపు చూస్తూ "రా! కూర్చో బాగున్నావా?" అడి గాడు నవ్వబోతూ.

బాగున్నానన్నట్లు తల ఊపి, అతని ఎదర కుర్చీలో కూర్చుంది సుజాత.

ఏం మాట్లాడాలో వెంటనే ఇద్దరికీ తట్టడంలేదు. సుజాత హృదయం ఎందుకో తీవ్రంగా స్పందించ సాగింది. ఆమె పెద వులు వణుకుతున్నాయి, కనుల్లో నీరూరుతూంది,

"ఎందుకలా కంపించిపోతున్నావ్? నాకు పెళ్ళయిపో

యింది. ఇద్దరు పిల్లలుకూడా! నిన్ను పెళ్ళిచేసుకోమని కోర నులే. సారీ! నీకు పెళ్ళయిందా. నీ విషయాలేమీ నాకు తెలి యవు. కనీసం నీ నుంచి ఉత్తరానికన్నా నోచుకోలేదు నేను" నిష్ఠూరం ధ్వనించించి విజయ్ గొంతులో,

"ఎందుకు విజయ్ ఉత్తరాలు? నువ్వు సుఖంగా జీవిం చాల - అదే నేను కోరుకొనేది. ఈ ఊరు..."

"ఎందుకు వచ్చావ్? అని అడుగుతావు. అవునా? ప్రత్యేకంగా నిన్ను చూడాలని రాలేదులే! కాంపుమీద వచ్చాను. ట్రావెలర్సు బంగళాకు వచ్చాను. నువ్వీ ఊర్లో ఉన్నట్లు తెలిసి ఓసారి చూసిపోవాలని వచ్చాను. ఏమిటో ఎంత వద్దనుకున్నా మనసు నిలువలేదు. నిన్ను చూడాలనిపించి నప్పుడల్లా నువ్వు వ్రాసిన ఉత్తరాలు చదువుకుంటూ వుంటాను.

"వద్దు, విజయ్, అవి చింపి పారేయ్!"

తల అడ్డంగా ఊపి. "ఊహు. నేనాపని చెయ్యలేను. కాని నువ్వేమిటి సుజా అలా బొమ్మలా?"

పేలవంగా నవ్వి, "అవును విజయ్! బొమ్మనే. మర బొమ్మని. మా కుటుంబాన్ని పోషించే పెద్దకొడుకుని. బరువు బాధ్యతలు నెత్తిన వేసుకొని చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళూ..." ఆమె గొంతు రుద్ధమై కన్నీళ్ళు చెంపల మీంచి జలజలా రాలు తూంటే - "సారెలూ, చీరలూ, పురుళ్ళూ - అన్నీ సక్ర

మంగా జరిపించే యంత్రాన్ని. విజయ్! నాకు కోరికలు లేవు. స్పందించే హృదయం, పులకించే మనస్సూ లేని మరబొమ్మని. ఆనాడు నిన్ను కాదని నీ మాట త్రోసిపుచ్చి మరబొమ్మలా బ్రతుకుతున్నాను, విజయ్!"

"నీకు పెళ్ళి చెయ్యటానికి ప్రయత్నించలేదా నీ తలిదండ్రులు?" జాలిగా హృదయం ద్రవించి కనులు చెమ్మగిల్లుతూంటే ఆర్ద్ర స్వరంతో ప్రశ్నించాడు విజయ్.

"ప్చ్. ఎందుకు ప్రయత్నిస్తారు విజయ్? ముప్పై సంవత్సరాలు నాకు వచ్చాక ఇంటి పరిస్థితులు కొంత సర్దుకున్నట్లనిపించాయి. అయినా నేను పెళ్ళిచేసుకు పోతే ఆ సంసారాన్ని ఈడ్చేదెవరు? పోన్లె. అయిపోయింది ఇహ బ్రతికినన్ని రోజులు బ్రతకను. ఆం దానికేంగాని నువ్విప్పుడెక్కడుంటున్నావ్? ఏమిటి చేస్తున్నావ్? మీ ఆవిడను తీసుకువచ్చావా?" పెదవులమీదికి నవ్వు తెచ్చుకుంటూ ప్రశ్నించింది సుజాత.

చెప్పాడు విజయ్. "మా ఆవిడను యీసారి వచ్చినప్పుడు తీసుకు వస్తాలే." అన్నాడు.

టీ తెప్పించి ఇచ్చింది సుజాత.

"హెడ్ మిస్ట్రెస్ నువ్వే అనుకుంటాను. బి.ఎ., బి.ఇడి. అయ్యావటగా అన్నాడు విజయ్.

"అవును నా గురించి ఏమీ తెలియదన్నావు. ఈ విషయాలన్నీ యెక్కడ సేకరించావు?"

"ఇక్కడే బంగ్లాకి వచ్చాకే. ఏమన్నా కబుర్లు చెప్పు - వెళ్ళిపోతాను ఇంకో పది నిమిషాల్లో" అన్నాడు వాచ్ చూసుకుంటూ విజయ్.

"విజయ్ సంఘవ్యవస్థ మారుతుంది కదూ!"

"అంటే! ఎందుకలా అడిగావ్!"

"మన చిన్నతనం రోజుల్లో శాఖాంతర వివాహమన గానే కొంపలంటుకుపోయినట్లు అగ్గుతగిలే పెద్దలు ఈ నాడు కులాంతర వివాహం జరిపించారంటే మారింది కాలమా, పరి స్థితులా? వ్యక్తులా? యెవరంటావు?"

"కాలంతో పరిస్థితులూ, వ్యక్తులూ కూడా, అయినా యువతీ యువకుల్లో సాహసం, తెగింపూ ముఖ్యం."

"నన్ను అంటున్నావు కదూ!"

"నిజమే సుజాతా! ఆనాడు నువ్వు ఒక అడుగు ముందుకు వేసి వుంటే ఏదో సర్దుబాటు జీవితం, అసంతృప్తి బ్రతుకు నాకూ; మరబొమ్మ బ్రతుకు నీకూ ఉండేవికావుగా"

"వద్దు. వద్దు. నువ్వు అసంతృప్తిగా రోజులు వెళ్ళ దియ్యకు. సుజాత...ఈ నిర్భాగ్యురాలు చచ్చిపోయిందనుకో. విజయ్! నిన్నూ, నీ అభిప్రాయాన్నీ త్రోసిపుచ్చిననాడే నే నిలాటి జీవితం గడపాలని నిర్ణయించుకున్నాను. కాని, మరో స్త్రీ మెడలో తాళికట్టిన నువ్వు సంతృప్తిగా, హాయిగా, సుఖంగా జీవితం వెళ్ళదీయాలి." అతినెమ్మదిగా అంది సుజాత

"మరి వెళ్తాను." లేచి నిల్చున్నాడు విజయ్. "గ్లాడ్ టు మీట్ యూ!" చెయ్యి ముందుకి చాపాడు విజయ్."

చేతులు జోడించి నమస్కరించింది సుజాత.

జీప్ స్కూలు గేటు దాటి రోడ్డు మళ్ళి పోయేవరకూ అలా చూస్తూ నిల్చుంది సుజాత,

* * *

"సిట్ డౌన్. ఏమిటీ అల్లరి? టీచరు రూమ్ దాటితే ఇలా నేకదూ!" టేబిల్‌పై చేత్తో చరిచి చప్పుడు చేస్తూ గట్టిగా అంది సుజాత.

ఎక్కడి పిల్లలు అక్కడ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

—o—